సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి. మార్కెట్‌కు 614 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.5

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.5, కనిష్టంగా రూ.2.50, సరాసరిన రూ.3.50 మేర పలికింది.

గరిష్టం/కనిష్టం

40.6°/23.8°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత తీవ్రంగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

వీరభద్రుని సేవలో శ్రీకాంత్ దంపతులు



ఆలయంలో సీతమ్మ పాదాలను తిలకిస్తున్న సినీనటులు

లేపాక్షి: సినీ నటుడు శ్రీకాంత్, ఊహ దంపతులు మంగళవారం లేపాక్షిలోని వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నంది విగ్రహాన్ని సందర్శించి ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్, ఊహ దంపతులతో సెల్ఫీలు తీసుకునేందుకు పర్యాటకులతో పాటు స్థానికులూ ఉత్సాహం చూపారు. అంతకుముందు అర్చకులు, పలువురు స్థానికులు శ్రీకాంత్ దంపతులకు ఘన స్వాగతం పలికారు. జేఏసీ కమిటీ సభ్యులు అంజినరెడ్డి, రవీంద్రనాథ్, రామాంజనేయులు, ఈరన్న, చంద్రశేఖర్ తదితరులు వారి వెంట ఉన్నారు.

5 రోజుల్లో తేలిక పాటి వర్షాలు



బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు పెద్దఎత్తున పెరగవచ్చునని పేర్కొన్నారు. మధ్యాహ్నం 39.8-40.8, రాత్రి 26 -27.1 డిగ్రీల మధ్య నమోదవుతాయని తెలిపారు.

సాగునీటి యాజమాన్యం భేష్

- ప్రశంసించిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం



గోరంట్లలో చెరువుకట్ట మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు

గోరంట్ల /పుట్టపర్తి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు జరిగేలా చేపట్టిన సాగునీటి యాజమాన్య చర్యలు అద్భుతంగా ఉన్నాయని ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం ప్రశంసించింది. ఏడుగురు సభ్యులతో కూడిన ప్రపంచ బ్యాంక్ ప్రతినిధుల బృందం మంగళవారం గోరంట్ల, బుక్కపట్నం మండలాల్లో పర్యటించింది. తొలుత ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన గోరంట్ల పెద్ద చెరువుకట్ట మరమ్మతు పనులను పరిశీలించింది. ఈ సందర్భంగా కట్ట మరమ్మతుల కోసం ఖర్చు చేసిన వివరాలు, చెరువు విస్తరణ, నీటి నిల్వ వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం పీడీ రాఘవయ్య ప్రతినిధి బృందం సభ్యులకు వివరించారు. కట్ట మరమ్మతులకోసం ఇప్పటి వరకు రూ.58 లక్షలు ఖర్చు చేసి 60 శాతం పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. జూన్‌లోపు పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు అధికారులకు సూచించారు. అలాగే రైతులకు ప్రయోజనం చేకూర్చే సప్లయ్ ఛానళ్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం స్థానిక మరువ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయంతో రైతుకు కలిగే ప్రయోజనాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన డెమోతో పాటు స్టాళ్లను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు మిత్ర గ్రూపులకు సబ్సిడీతో అందిస్తున్న వ్యవసాయ యంత్రాలు, వాటి ఉపయోగాలను అధికారుల ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ గంగాధర్, డీఈ నారాయణనాయక్, ప్రపంచ బ్యాంక్ ప్రతినిధుల బృందం సభ్యులు వెంకట్, శాంతన్ పాల్గొన్నారు.

గూనిపల్లి చెరువు పనుల పరిశీలన

అనంతరం ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం సభ్యులు బుక్కపట్నం మండలం గూనిపల్లిలో పర్యటించారు. ప్రపంచ బ్యాంకు నిధులు రూ.70 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేసిన చెరువును పరిశీలించారు. చెరువు ఆయకట్టు విస్తీర్ణం, పంటలసాగు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉద్యానవన తోటలను సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అందజేసిన చేప పిల్లలను చెరువులో వదిలారు.

నేడు నార్పలకు సీఎం జగన్

- 'వసతి దీవెన'ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి



నార్పలలో సిద్ధమైన సీఎం సభా ప్రాంగణం

శింగనమల/ నార్పల: ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారి బుధవారం శింగనమల నియోజకవర్గం నార్పలకు వస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభ నుంచే జగనన్న వసతి దీవెన పథకం నగదును విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి కంప్యూటర్ బటన్ నొక్కి జమ చేయనున్నారు. ఇప్పటికే అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయించారు.

ఏర్పాట్ల పరిశీలన

సీఎం పర్యటన ఏర్పాట్లను మంగళవారం మంత్రి ఉషశ్రీ చరణ్, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు రాజారెడ్డి పరిశీలించారు. నార్పలలోని బాలుర హైస్కూల్‌లోని హెలిప్యాడ్‌తో పాటు సభా ప్రాంగణం వరకు రోడ్డు మార్గాన్ని పరిశీలించారు. వసతి దీవెన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. శింగనమల నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే పద్మావతి తెలిపారు.

38 గ్యాలరీల ఏర్పాటు

జగనన్న వసతి దీవెన కార్యక్రమానికి వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూర్చోవడానికి 38 గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్యాలరీకి కుర్చీలు, ఎండ వేడిమి లేకుండా కూలర్లు ఏర్పాటు చేశారు. మజ్జిగ, నీళ్ల బాటిళ్లు అందించేందుకు సిద్ధంగా ఉంచారు. సభా ప్రాంగణంలో ఇబ్బందులు కలగకుండా చూసేందుకు పంచాయతీరాజ్, రెవెన్యూ సిబ్బందిని నియమించి జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రావు, ఆర్డీఓ మధుసూదన్ దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి సభా ప్రాంగణం వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు 1200 మంది పోలీసులను విధులకు కేటాయించారు. కార్యక్రమంలో ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, ఎంపీపీ నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ రఘునాథరెడ్డి, అనంతపురం మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

- నేడు నార్పలకు సీఎం జగన్
- ఏర్పాట్లపై విమానాశ్రయం వద్ద అధికారులతో కలెక్టర్ సమీక్ష



పుట్టపర్తి విమానాశ్రయంలో బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి టౌన్: ''ఏర్పాట్లు ఘనంగా ఉండాలి. ఎక్కడా చిన్న పొరపాట్లూ జరగకూడదు, సీఎం జగన్ తిరిగి వెళ్లే వరకూ అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి'' అని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. ఈనెల 26న (బుధవారం) అనంతపురం జిల్లా నార్పల పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి గన్నవరం నుంచి విమానంలో పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నార్పల వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, ఇతర అధికారులు సత్యసాయి విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో సత్యసాయి విమానాశ్రయం వద్ద స్పెషల్ డాక్టర్ల ఏర్పాటు, అంబులెన్స్, సేఫ్ రూమ్, ఫైర్ సేఫ్టీ చర్యలు, ఫుడ్‌సేఫ్టీ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఉమామహేశ్వర్‌రెడ్డి, యశ్వంత్, ఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ సంజీవయ్య, జిల్లా ప్రజా రవాణాధికారి కరుణసాగర్‌రెడ్డి తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి ఉదయం 9.45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. 10 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నార్పలకు వెళ్తారు. అక్కడ 'జగనన్న వసతి దీవెన' కార్యక్రమం ముగిసిన తర్వాత మధ్యాహ్నం 1.30 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకొంటారు. 1.40 గంటలకు తిరిగి గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళతారని అధికారులు తెలిపారు.

పటిష్టభద్రతా ఏర్పాట్లు

కొత్తచెరువు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి గన్నవరం నుంచి సత్యసాయి విమానాశ్రయం చేరుకోనుండటంతో ఆ పరిసర ప్రాంతాల్లో బుధవారం ట్రాఫిక్ ఆంక్షలు విధించామన్నారు. అలాగే ఓ డీఎస్పీ, నలుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 12 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 125 మంది పోలీసులు, ఏడుగురు మహిళా పోలీసులు, 24 మంది ఏఆర్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు, హోంగార్డులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఓ ప్రకటనలో వెల్లడించారు. మంగళవారమే విమానాశ్రయం పరిసరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చినట్లు పేర్కొన్నారు.

విద్యార్థికి చల్లని 'దీవెన'

- నిరుపేద విద్యార్థులకు జగన్ సర్కార్ ఆర్థిక అండ
- 'జగనన్న వసతి దీవెన'తో భోజనం, వసతి ఖర్చుల చెల్లింపు
- నేడు నార్పల సభ నుంచి నిధులు విడుదల చేయనున్న సీఎం జగన్
- జిల్లాలోని 31,968 మంది తల్లుల ఖాతాల్లో రూ.33.68 కోట్లు జమ

ప్రశాంతి నిలయం: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద విద్యార్థుల చదువులకు అండగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్కరూ ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో వివిధ పథకాలు అమలు చేస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ చదివే విద్యార్థులకు 'జగనన్న అమ్మఒడి' పథకం ద్వారా ఆర్థిక చేయూతనిస్తున్నారు. అలాగే ఐటీఐ, డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజినీరింగ్ కోర్సులు చదివే విద్యార్థులకు 'జగనన్న విద్యా దీవెన', 'వసతి దీవెన' పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తూ వారి బంగారు భవిష్యత్తును బాటలు వేస్తున్నారు.

వసతి దీవెన అమలు ఇలా...

విద్యా దీవెనతో విద్యార్థులు ఫీజులు పూర్తిస్థాయిలో రీయింబర్స్ చేస్తున్న జగన్ సర్కార్..వసతి దీవెన ద్వారా భోజనం, వసతి ఖర్చులను కూడా చెల్లిస్తూ అండగా నిలుస్తోంది. 'వసతి దీవెన' కింద ఏటా రెండు విడతల్లో ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే విద్యార్థులకు రూ.20 వేల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ మొత్తాన్ని నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాకు జమ చేస్తుండగా, వారు వెళ్లి కళాశాలల్లో ఫీజులు చెల్లిస్తున్నారు.

జిల్లాలో జగనన్న వసతి దీవెన ద్వారా చేకూరనున్న లబ్ధి వివరాలు

కులం	విద్యార్థులు	తల్లులు	నిధులు
ఎస్సీ	4,683	4,280	రూ.4.47 కోట్లు
ఎస్టీ	1,951	1.755	రూ.1.84 కోట్లు
బీసీ	18,582	16,835	రూ.17.83 కోట్లు
ఈబీసీ	3,684	3.441	రూ.3.60 కోట్లు
కాపు	2,775	2,547	రూ.2.65 కోట్లు
ముస్లిం	3,380	3,088	రూ.3.25 కోట్లు
క్రిస్టియన్	25	22	రూ.2.30 లక్షలు

నేడు ఖాతాల్లో జమ

ఇప్పటికే విద్యాదీవెన సొమ్మును విద్యార్థుల ఖాతాల్లో జమ చేసిన రాష్ట్ర ప్రభుత్వం... 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి 'జగనన్న వసతి దీవెన' సొమ్మును బుధవారం విడుదల చేయనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగమోహన్‌రెడ్డి నార్పల బహిరంగ సభలో కంప్యూటర్ బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

సీఎం చేసిన మేలు మరువలేం



'వసతి దీవెన' పథకం అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారు. నిరుపేద తల్లిదండ్రులపై ఫీజుల భారం పడకుండా ఆదుకుంటున్నారు. అందువల్లే నాలాంటి ఎందరో విద్యార్థులు ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారు. జగనన్న చేస్తున్న మేలు మరువలేనిది.

–అజయ్ సాయిరెడ్డి, ఫార్మా విద్యార్థి, జేఎన్టీయూ(ఓటీపీఆర్ఐ)

మేం అదృష్టవంతులం



పిల్లల ఉన్నత విద్య నిరుపేద కుటుంబాలకు మోయలేని భారం లాంటిది. అందుకే చాలా మంది ప్రతిభ ఉండీ ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత చదువులకు దూరమయ్యారు. కానీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో చదువుకుంటున్న మేం నిజంగా అదృష్టవంతులం. విద్యాదీవెనలతో ఫీజులిచ్చి, వసతి దీవెనతో భోజన, వసతి ఖర్చులు చెల్లిస్తున్నారు.

–సాయి రూపా, సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల

పనిచేయకపోతే పంపించేస్తా!

- విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- అధికారులను హెచ్చరించిన కలెక్టర్ అరుణ్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు


హాజరైన జిల్లా అధికారులు

పుట్టపర్తి అర్బన్: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, శ్రద్ధపెట్టి పని చేయక పోయినా వేటు తప్పదని కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన హాలులో రెవెన్యూ, హౌసింగ్, ఐసీడీఎస్, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు, ఉపాధి హామీ, సంక్షేమ కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాను అన్నింటా అగ్రస్థానంలో నిలిపాలన్నారు. రెవెన్యూ, ఇతర ప్రజా సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై ఆర్డీఓలు తమ పరిధిలోని తహసీల్దార్లతో రోజూ ఫోన్‌లో ఆరా తీయాలన్నారు.

ధర్మవరం ఆర్డీఓ, తహసీల్దార్‌కు మందలింపు

భూ రీ సర్వే పనులను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రీసర్వేలో వెనుకబడి ఉన్న ధర్మవరం ఆర్డీఓతో పాటు సీకేపల్లి తహసీల్దార్‌ను మందలించారు. సర్వే రాళ్లు నాటడం ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నించగా, వారిద్దరూ ఏవో సమస్యలు చెప్పేందుకు ప్రయత్నించారు. దీంతో కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. భూ వివాదాల పరిష్కారానికే రీసర్వే నిర్వహిస్తున్నాం. సమస్యలు రాకుండా ఎలా ఉంటాయి, వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు పోవాలన్నారు. అవసరమైన చోట సాంకేతికతను ఉపయోగించుకోవాలన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రాళ్లు నాటే పని త్వరగా పూర్తి చేయాలన్నారు. చెన్నేకొత్తపల్లి మండలానికి 2,600 రాళ్లు వచ్చాయని, వీఆర్‌ఓలు, సర్వేయర్లు టీంలుగా ఏర్పడి మే 5వ తేదీ నాటికి రాళ్లు నాటే పని పూర్తి చేయాలన్నారు.

పోషణ కిట్ల నాణ్యతను పరిశీలించాలి

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషణ కిట్లు నాణ్యంగా ఉన్నాయో... లేదో తప్పకుండా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, కార్యకర్తలతో ప్రతి వారం సమీక్షించాలని పీడీ లక్ష్మీకుమారిని ఆదేశించారు. కేంద్రాలను మరింత బలోపేతం చేయాలన్నారు. 10వ తేదీలోపు పురోగతి చూపాలన్నారు. ఆరోగ్యం బాగా లేకపోతే సెలవులో వెళ్లిపోవాలన్నారు. అనారోగ్యాన్ని సాకుగా చూపి పనులు చేయమంటే కుదరదన్నారు. ఇక సంక్షేమ వసతి గృహాల్లో పిల్లల ఆరోగ్యంపై వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆరా తీయాలని, ఇందులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ఉపాధి హామీ పథకంలో రోజూ లక్ష మంది వరకూ పనికి వచ్చేలా చూడాలన్నారు. వర్షాకాలంలోపు 'అమృత్ సరోవర్' పనులు పూర్తి చేయాలన్నారు.

పద్ధతి మార్చుకోండి

వివిధ అభివృద్ధి పనుల్లో అమడగూరు, నల్లమాడ, మడకశిర, కదిరి మండలాలు చాలా వెనుకబడి ఉన్నాయని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు పద్ధతి మార్చుకుని పనితీరు మెరుగుపర్చుకోవాలన్నారు. ఇలాగే ఉంటామంటే ఇకనుంచి సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓలు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర, సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్‌ఖాన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్, డీఏఓ సుబ్బారావు, డీహెచ్‌ఓ చంద్రశేఖర్, మెప్మా పీడీ విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమ శాఖ అధికారి చాంద్‌బాషా, డీఈఓ మీనాక్షి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, కమిషనర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారించాలి

రొద్దం: గ్రామీణ ప్రాంతాల్లో ఏ మహిళ కూడా రక్తహీనతతో బాధపడకూడదని, ఇందుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కలిపి గ్రామంలో పర్యటించారు. ఆరోగ్య ఉప కేంద్రం వద్ద గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భవతులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైఎస్సార్ కిట్లను ప్రతి గర్భిణీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అప్పుడే రక్తహీనత అనే సమస్య ఉండదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్తీక్, తహసీల్దార్ అనంతచారి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, వైద్యాధికారి జగదీశ్‌బాబు, స్థానిక సర్పంచ్ కదిరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వనజ పాల్గొన్నారు.

భూసేకరణ పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న జేసీ టీఎస్ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో వివిధ జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లతో సమావేశమయ్యారు. తొలుత జాతీయ రహదారుల భూ సేకరణపై సమీక్షించారు. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాల వివరాలు త్వరగా అందజేయాలన్నారు. అదే విధంగా ఎన్‌హెచ్-342 భూ సేకరణ వేగవంతం చేయాలన్నారు. గోరంట్ల-హిందూపురం రహదారికి సంబంధించి అవార్డును త్వరగా కలెక్టరేట్‌కు పంపాలన్నారు. అనంతరం సమగ్ర భూ సర్వేపై సమీక్షించారు. జిల్లాకు 20,735 రాళ్లు రావడంతో జిల్లాలో 16 గ్రామాల పరిధిలో 13,299 రాళ్లు పాతినట్లు తెలిపారు. మరో 7,436 స్టోన్స్ ప్లాంటేషన్ చేయాల్సి ఉందన్నారు. మరో 13,035 రాళ్లు రావాల్సి ఉందన్నారు. రాళ్లు పాతే కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర, సూపరింటెండెంట్ బాలాజీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ పాల్గొన్నారు.

సంతృప్తికర సేవల్లో ఏపీజీబీ ముందంజ

- నికరలాభం రూ. 595.15 కోట్లు
- నికర విలువ రూ.3,789.26 కోట్లు
- లావాదేవీల్లో 6.11 శాతం వృద్ధి
- ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్


మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

కడప సెవెన్‌రోడ్స్: ఖాతాదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడంలో తమ బ్యాంకు ముందు వరుసలో ఉందని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. 2022–23 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను సాధించిన ప్రగతిని మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రూ. 41,656 కోట్ల లావాదేవీలతో రూ. 595.15 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు తెలిపారు. 2021–22 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే రూ. 2,398.42 కోట్ల అదనపు లావాదేవీలతో 6.11 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకున్నట్లు వివరించారు. సీఆర్‌ఏఆర్ చట్టబద్ధమైన లక్ష్యం 9.00 శాతానికి దీటుగా 23.90 శాతం నమోదు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. రూ. 3,789.26 కోట్ల నికర విలువలతో దేశంలోనే అత్యధిక నెట్‌వర్క్ కలిగిన గ్రామీణ బ్యాంకుల్లో ఒకటిగా నిలువడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఖాతాదారులకు ఇంటి వద్దే బ్యాంకు సేవలు అందిస్తున్నామని, 98 ఏటీఎంలు ఏర్పాటు చేశామన్నారు. ప్రాధాన్యత రంగాలకు అందించిన రుణాల స్థాయి రూ. 19,923 కోట్లకు చేరిందన్నారు. వ్యవసాయ రంగానికి రూ. 16,899 కోట్ల రుణాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 45,500 కోట్ల లావాదేవీల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. మొత్తం డిపాజిట్లలో 38 శాతం కాసా డిపాజిట్లను సేకరించనున్నట్లు పేర్కొన్నారు. చిన్న మొత్తాల పొదుపును ప్రోత్సహించడం, పీఎంజేడీవై ఖాతాల్లో లావాదేవీలు నిర్వహించేలా అవగాహన పెంపొందించడం, రికరింగ్ డిపాజిట్లు, రీటైల్ టర్మ్ డిపాజిట్లను విరివిగా ప్రారంభిస్తామన్నారు. ఖాతాదారులకు డిజిటల్ లెండింగ్, సోషల్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా నగదు ఉపసంహరణ తదితర ఆధునిక సాంకేతిక సదుపాయాలు అందుబాటులోకి తెస్తామన్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు, ఎంఎస్‌ఎంఈ రంగాలకు, గృహ నిర్మాణం, కొనుగోళ్లకు విస్తృతంగా రుణాలు అందజేస్తామన్నారు. సమావేశంలో బ్యాంకు జీఎంలు జగదీశ్వర్‌రావు, కె.విజయభాస్కర్, పీఆర్ పడగెటవార్, ఆర్.గిరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి


లక్ష్మమ్మ (ఫైల్)

గుడిబండ: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం ఫళారం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ (70) శనివారం గ్రామ శివారులో బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలిస్తున్నారు. మంగళవారం ఉదయం గ్రామ శివారులోని బావిలో లక్ష్మమ్మ మృతదేహం తేలాడుతుండడం గమనించిన గొర్రెల కాపరులు వెంటనే విషయాన్ని ఆమె కుటుంబసభ్యులకు చేరవేశారు. సమాచారం అందుకున్న పోలీసులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. ప్రమాదవశాత్తు ఆమె బావిలో పడి మృతి చెందినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడంతో ఆ దిశగా మృతురాలి కుమారుడు బండేరంగప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడి దుర్మరణం


ట్రాక్టర్ కింద చిక్కుకుపోయిన మహేష్ మృతదేహం

అమడగూరు: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... అమడగూరు మండలం కొత్తపల్లికి చెందిన మహేష్ (30) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి పునాది రాళ్లను లోడు తీసుకుని బలకవారిపల్లిలో అన్‌లోడ్ చేసి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలో ఎదురుగా వచ్చిన ప్రైవేట్ బస్సుకు సైడ్ ఇచ్చే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పది అడుగుల దిగువన ఉన్న పొలంలోకి బోల్తాపడింది. డ్రైవింగ్ చేస్తున్న మహేష్‌పై ట్రాక్టర్ ఇంజన్ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నెల కిందటే భార్య మృతి

నెల రోజుల కిత్రమే మహేష్ భార్య అనారోగ్యంతో మృతి చెందింది. ఒకే ఇంట్లో 30 రోజుల వ్యవధిలోనే ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. కాగా, మహేష్ మృతి వార్త తెలుసుకున్న వెంటనే వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, బంధువులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. మహేష్ నాలుగేళ్ల కుమార్తెకు విషయం అర్థం కాక నాన్నకేమైందంటూ అందరినీ అడుగుతుంటే గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఉమ్మడి రాష్ట్ర స్థాయి భజన పోటీలు

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లిలో మే 1వ తేదీన ఉమ్మడి తెలుగు రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ గ్రామ పెద్దలు, గ్రామస్తులు మంగళవారం తెలిపారు. గ్రామంలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో పోటీలు ఉంటాయి. విజేతలుగా తొలి 12 స్థానాల్లో నిలిచిన భజన బృందాలకు నగదు పురస్కారాలతో సత్కరించనున్నారు. ఆసక్తి ఉన్న భజన బృందాలు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 94935 00460, 99594 13224లో సంప్రదించవచ్చు.

5న తిరువణ్ణామలైకు ఆర్టీసీ బస్సులు


పుట్టపర్తి టౌన్: వైశాఖ పౌర్ణమి సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలైలో వెలసిన అరుణాచలస్వామికి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి మధుసూదన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 5న వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి దర్శనంతో పాటు గిరి ప్రదర్శన చేసే భక్తుల కోసం పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, కదిరి, డిపోల నుంచి 20 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఆయా డిపోల నుంచి 5వ తేదీ సాయంత్రం బయలుదేరే బస్సులు 6వ తేదీ ఉదయం అరుణాచలం చేరుకుంటాయన్నారు. భక్తుల సౌకర్యార్థం 30 మంది అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటే అదనపు చార్జీలతో వారి గ్రామం నుంచే బస్సులు నడుపుతామన్నారు. ఈఅవకాశాన్ని జిల్లాలోని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా ఆర్టీసీ డిపో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతుడు సిద్దేశ్

మడకశిర(అగళి): విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అగళి మండలం ముక్కడంపల్లి గ్రామానికి చెందిన సిద్దేశ్(33) గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం రామన్నపల్లి క్రాస్‌లో గొర్రెలను మేపుతుండగా వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని రొళ్ల ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సిద్దేశ్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం ఆయన భార్య గర్భిణి. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఘటనపై అగళి ఎస్‌ఐ లావణ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చిరుత దాడిలో గొర్రె మృతి


గొర్రె కళేబరం

రొళ్ల: చిరుత దాడిలో ఓ గొర్రె మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం కాల్వేపల్లికి చెందిన కరియన్న గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. గ్రామ శివారులోని కల్లంలో సోమవారం రాత్రి గొర్రెలను వదిలి నిద్రకు ఉపక్రమించినప్పుడు అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ చిరుత మందలోకి చొరబడి ఓ గొర్రెను నోట కరుచుకుని ఈడ్చుకెళ్లింది. ఆ సమయంలో గొర్రెల అలజడికి నిద్ర లేచిన కరియన్న, మిగిలిన కాపర్లు వెంటనే అప్రమత్తమై గట్టిగా కేకలు వేస్తూ చిరుతను వెంబడించడంతో అది పారిపోయింది. అప్పటికే గొర్రె మృతి చెందింది. దీంతో దాదాపు రూ.12 వేలు నష్టం వాటిల్లినట్లు కాపరి కరియన్న వాపోయాడు. కాగా, సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గ్రామంలోని మరో ఇద్దరికి చెందిన గొర్రె పిల్లలను చిరుతల ఎత్తుకెళ్లినట్లు సమాచారం.

బియ్యం లారీ పట్టివేత

సోమందేపల్లి: అక్రమంగా కర్ణాటకకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని సోమందేపల్లిలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు జిల్లా బనగానపల్లి నుంచి కర్ణాటకకు బియ్యం తరలిస్తున్నట్లుగా ప్రాథమిక విచారణలో తేలింది. విషయం తెలుసుకున్న బియ్యం యజమాని అహమ్మద్ ఖాన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని కర్నూలు జిల్లాలో ప్రభుత్వం వేసిన వేలంలో ఈ బియ్యాన్ని తాను కొనుగోలు చేసినట్లుగా వివరించాడు. ఇందుకు సంబంధించి చూపిన రికార్డులను రెవెన్యూ అధికారుల ద్వారా ధ్రువీకరించుకున్న అనంతరం వాహనాన్ని సాయంత్రం పోలీసులు వదిలి వేశారు.

1,000 కిలోల గుళిక మందు స్వాధీనం

నల్లమాడ: ప్రభుత్వ అనుమతుల్లేకుండా అక్రమంగా విక్రయాలకు సిద్ధంగా ఉంచిన వెయ్యి కిలోల ఆర్గానిక్స్ అండ్ నాచురల్స్ గుళికల మందును వ్యవసాయాధికారులు స్వాధీనం చేసుకున్నారు. రైతులకు విక్రయించేందుకు నల్లమాడలోని మారుతీ బజార్‌లో నివాసముంటున్న భాస్కర్‌రెడ్డి ఇంటి వరండాలో సిద్ధంగా ఉంచిన 710 కిలోల 'కిసాన్ పవర్' ఫార్ములా ఆర్గానిక్స్ అండ్ నాచురల్స్ గుళికల మందును సోమవారం అధికారులు సీజ్ చేసి విషయం తెలిసిందే. ఈ క్రమంలో అదే ఇంట్లో మరికొన్ని బకెట్లలో మందు నిల్వలను గుర్తించిన అధికారులు ఆ ఇంటిని సీజ్ చేశారు. 24 గంటలు గడువిచ్చినా యజమాను లెవరూ ముందుకు రాకపోవడంతో ఇంటి పర్యవేక్షకుడు తులసే నాయక్‌ను పిలిపించి పంచాయతీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, వీఆర్వో వాసుదేవరెడ్డి, పోలీసుల సమక్షంలో తాళం బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. దాదాపు 100 క్రేట్లలోని వెయ్యి కిలోల గుళికల మందును స్వాధీనం చేసుకున్నారు. వ్యవసాయాధికారి సుమతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అలరించిన కచేరీ

ప్రశాంతి నిలయం: 'మా జీవన గమనంలో ప్రతి క్షణం అనుభవించే ఆనందానికి నీవే మూలం సాయీ' అంటూ సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు నిర్వహించిన సంగీత, నృత్య సమ్మేళనం అలరించింది. మంగళవారం సాయంత్రం బృందావన్ క్యాంపస్‌కు చెందిన యూజీ, పీజీ విద్యార్థులు కృతజ్ఞతా పూర్వక కార్యక్రమాన్ని నిర్వహించి, ఆకట్టుకున్నారు.